నమస్తే తెలంగాణ

భద్రాద్రి కొత్తగూడెం

5 | ఖమ్మం, బుధవారం 11 డిసెంబర్ 2024 | BHADRADRI KOTHAGUDEM




ఖమ్మంలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేసి నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



మధిర : తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న లింగాల, బీఆర్ఎస్ నాయకులు



అశ్వారావుపేట : తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా, బీఆర్ఎస్ శ్రేణులు



కొత్తగూడెం అర్బన్ : తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేసి నినాదాలు చేస్తున్న మాజీ మంత్రి వనమా

# జై తెలంగాణ తల్లి

- విగ్రహ రూపాన్ని మార్చడం మూర్ఖత్వం
- కానీ ప్రజల గుండెల్లోంచి చెరపడం అసాధ్యం
- తెలంగాణ తల్లి అంటేనే స్వరాష్ట్ర పోరాట స్ఫూర్తి
- దానిని కాపాడేందుకు మరో ఉద్యమానికి సిద్ధం
- విగ్రహ రూపం మార్పుపై భగ్గుమన్న బీఆర్ఎస్
- కాంగ్రెస్ కుట్రను తూర్పారబట్టిన సమాజం
- ఊరూరా తెలంగాణ తల్లి విగ్రహాలకు క్షీరాభిషేకాలు

మూర్ఖపు నిర్ణయాలతో తెలంగాణ తల్లి విగ్రహ రూపాన్ని మార్చినంత మాత్రాన రాష్ట్ర ప్రజల గుండెల్లోంచి ఆ విగ్రహ స్ఫూర్తిని చెరపడం అసాధ్యమని బీఆర్ఎస్ నేతలు స్పష్టం చేశారు. తమ అస్తిత్వాన్ని కాపాడుకునేందుకు మరో ఉద్యమానికైనా సిద్ధమని తేల్చిచెప్పారు. ఏడాది కింద వచ్చిన రేవంత్ ప్రభుత్వం.. తాజాగా తెలంగాణ తల్లి విగ్రహ స్వరూపాన్ని మార్చడాన్ని, కాంగ్రెస్ తల్లిని పోలిన విధంగా ఉండే విగ్రహాన్ని రాష్ట్ర సచివాలయం ఎదుట ప్రతిష్ఠించడాన్ని వ్యతిరేకిస్తూ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ఉద్యమకారులు మంగళ వారం శాంతియుత నిరసనలు చేపట్టారు. అన్ని మండలాల్లోనూ తెలంగాణ తల్లి విగ్రహాలకు క్షీరాభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మూర్తీభవించిన మన తెలంగాణ తల్లి విగ్రహం అంటే మన అస్తిత్వానికి ప్రతీక అని గుర్తుచేశారు. అంతటి ఖ్యాతిగాంచిన తెలంగాణ తల్లి రూపాన్ని మార్చడమంటే తెలంగాణ స్ఫూర్తిని అవమానించడమే అవుతుందని ధ్వజమెత్తారు. మనకు మాత్రమే ప్రత్యేకమైన బతుకమ్మను కూడా తెలంగాణ తల్లి చేతిలో లేకుండా చేయడం, దాని స్థానంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల గుర్తు పెట్టడం దుర్మార్గమని దుయ్యబట్టారు. కేసీఆర్ మీద, ఆయన కుటుంబం మీద ఉన్న కక్షతో తెలంగాణ తల్లి విగ్రహ రూపాన్ని మార్చడాన్ని తెలంగాణ సమాజం సహించబోదని స్పష్టం చేశారు. విగ్రహాన్ని మార్చినప్పటికీ తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని మార్చలేరని తేల్చి చెప్పారు. కొత్తగూడెంలో మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, అశ్వారావుపేటలో మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, మధిరలో జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, ఇల్లెందులో సీనియర్ నాయకుడు దిండిగాల తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా 'జై తెలంగాణ తల్లి' అంటూ నినాదాలు చేశారు.

*- ఖమ్మం, డిసెంబర్ 10*
*(నమస్తే తెలంగాణ ప్రతినిధి)*



ఇల్లెందు : తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## పకడ్బందీగా 'ముక్కోటి' ఏర్పాట్లు

### అధికారుల సమీక్షలో కలెక్టర్ జితేశ్ వి పాటిల్



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

భద్రాచలం, డిసెంబర్ 10 : ఏటా అత్యంత వైభవోపేతంగా నిర్వహించే ముక్కోటి ఏకాదశి ఉత్సవాల ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని, ఎలాంటి లోటుపాట్లు లేకుండా పనులన్నీ సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. ముక్కోటి ఏకాదశి ఉత్సవాల నిర్వహణకు సంబంధించి భద్రాచలం పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో మంగళవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముక్కోటి ఏర్పాట్ల పర్యవేక్షణ బాధ్యతను ఆర్డీవో, బందోబస్తు ఏర్పాట్లను పోలీసు శాఖ చేపట్టాలన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్నందున పట్టణంలోని లాడ్జీలు, హోటళ్ల యజమానులతో సమావేశం నిర్వహించి ధరలు నిర్ణయించాలని సూచించారు. భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి ఆలయం, దుమ్ముగూడెంలోని పర్ణశాల రామాలయాలను విద్యుద్దీపాలతో అలంకరించాలన్నారు. ఆలయ పరిసరాల్లో సీసీ టీవీలు, ఉత్సవాలను తిలకించేందుకు ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. తెప్పోత్సవానికి హంస వాహనాన్ని తనిఖీ చేసి ధ్రువీకరణ నివేదిక సమర్పించాలని ఇరిగేషన్ ఈఈని ఆదేశించారు. భక్తులు గోదావరి నదిలోకి వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. భద్రాచలం, పర్ణశాలలో ప్రత్యేకంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. భక్తులకు సురక్షిత మంచినీటి సరఫరా చేయాలని, బస్సులు, రైల్వే సమయాలు, జిల్లాలోని ప్రముఖ దర్శనీయ స్థలాలను తెలియచేసే విధంగా చార్టులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వాహనాలు పార్కింగ్ చేయడానికి పార్కింగ్ స్థలాల వద్ద సైనేజ్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. కరకట్ట వద్ద మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయడంలో అలసత్వం వహించే అధికారులపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. రాష్ట్రస్థాయి కళాకారులచే భద్రాచలం ప్రాముఖ్యత తెలిపేలా సాంస్కృతిక కార్యక్రమాలు, గిరిజన సంప్రదాయ వంటకాలు, వస్తువులు ప్రతిబింబించేలా స్టాల్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎస్పీ రోహిత్‌రాజు, ఐటీడీఏ పీవో రాహుల్, అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యాచందన, ఆలయ ఈవో రమాదేవి, ఆర్డీవో దామోదరరావు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రామయ్య ఉత్తర ద్వార దర్శనానికి ఆన్‌లైన్ టికెట్లు

భద్రాచలం, డిసెంబర్ 10 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం పట్టణంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో ఈ నెల 31 నుంచి ప్రారంభమయ్యే వైకుంఠ ఏకాదశి మహోత్సవాల్లో భాగంగా స్వామివారి ఉత్తర ద్వార దర్శనం కోసం ఆన్‌లైన్ టికెట్ల సదుపాయం కల్పించినట్లు ఆలయ ఈవో రమాదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టికెట్ల ధరలు రూ.2వేలు, రూ.1000, రూ.500, రూ.250 చొప్పున నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ప్రత్యక్షంగా ఉత్తర ద్వార దర్శనానికి హాజరు కాలేని భక్తుల సౌకర్యార్థం పరోక్ష సేవల కోసం ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. రూ.2వేలు, రూ.1000 https://bhadradritemple.telang ana.gov.in వెబ్‌సైట్ ద్వారా బుధవారం ఉదయం 11 గంటల నుంచి బుకింగ్ సదుపాయం కల్పించామని తెలిపారు. ఆన్‌లైన్ టికెట్లు బుక్ చేసుకున్న భక్తులు డిసెంబర్ 25 నుంచి జనవరి 10వ తేదీ ఉదయం 5 గంటల వరకు దేవస్థాన తానీషా కల్యాణ మండప కార్యాలయంలో ఒరిజినల్ టికెట్లు పొందవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

# ఆశా కార్యకర్తల ముందస్తు అరెస్టు

### 'పాలెం' తహసీల్ ఎదుట ఆశా కార్యకర్తల నిరసన



రఘునాథపాలెంలో ఆశా కార్యకర్తలను అదుపులోకి తీసుకున్న పోలీసులు

రఘునాథపాలెం/కారేపల్లి/అశ్వారావుపేట, డిసెంబర్10 : హైదరాబాద్‌లో పలువురు ఆశ కార్యకర్తలను అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ ఖమ్మం జిల్లా రఘునాథపాలెం తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ఆశా కార్యకర్తలు నిరసన తెలిపారు. హైదరాబాద్‌లో శాంతియుతంగా సమస్యలు తెలిపేందుకు వెళ్తున్న తమను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించడంపై మండిపడ్డారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు నవీన్‌రెడ్డి మాట్లాడుతూ మండలానికి చెందిన ఆశా వర్కర్ల ఇళ్ల చుట్టూ పోలీసు జీపులను చక్కర్లు కొట్టించడం ఏమిటని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆశా వర్కర్ల వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఇచ్చిన హామీని మరిచిపోయారా.. అని ప్రశ్నించారు. కార్యక్రమంలో హెల్త్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు జల్లారపు మంగ, డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి కూచిపూడి నరేశ్, నాయకులు విజయ, అరుణ, ధనమ్మ, సలోమి, అనసూర్య, సావిత్రి, బేబి తదితరులు పాల్గొన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కారేపల్లి నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఆశా కార్యకర్తలను సోమవారం రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వారిని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండబోయిన నాగేశ్వరరావు మంగళవారం కలిసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఇచ్చిన హామీలపై అతీగతీ లేదన్నారు. శాంతియుతంగా ఆందోళన చేసేందుకు వెళ్తున్న వారిని అడ్డుకోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు వాంకుడోతు కమల, జంగ కల్యాణి, భూక్యా సుజాత, ఆదెర్ల దేవకరుణ, అరుణ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అశ్వారావుపేట నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఆశా కార్యకర్తలను పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టులతో పోరాటాలను ఆపలేరని, సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు.



కారేపల్లిలో పోలీసుల అదుపులో ఉన్న ఆశా కార్యకర్తలు



అశ్వారావుపేటలో ఆశా కార్యకర్తలను అరెస్ట్ చేసిన పోలీసులు

### ఆశా కార్యకర్తలపై బైండోవర్ కేసు

మామిళ్లగూడెం, డిసెంబర్ 10 : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్ వెళ్తున్న ఆశా కార్యకర్తలను పోలీసులు ఎక్కడికక్కడ ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. ఖమ్మం నగరంలోని పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో సుమారు 63 మంది ఆశా కార్యకర్తలను అరెస్టు చేసి బైండోవర్ చేసినట్లు పోలీసు వర్గాలు ధ్రువీకరించాయి. ఖమ్మం వన్ టౌన్ పరిధిలో 58 మందిపై మంగళవారం కేసు నమోదు చేసి బైండోవర్ చేసినట్లు పోలీసులు తెలిపారు. సోమవారం టూ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఐదుగురు ఆశా కార్యకర్తలను అదుపులోకి తీసుకుని వారిని బైండోవర్ చేసినట్లు పోలీసులు తెలిపారు. అయితే ఆశా కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించడాన్ని పలు పార్టీల ప్రతినిధులు తీవ్రంగా ఖండించారు.

# జాతీయ రహదారి ఆనుకొని అక్రమ కట్టడం!

- నిబంధనలు పట్టించుకోకుండా బిలీఫ్ ఆసుపత్రి నిర్మాణం
- అనుమతులు లేకుండానే వైద్యసేవలు ప్రారంభం
- నోటీసులు జారీచేసిన వైద్యారోగ్యశాఖ, పంచాయతీ
- ప్రధాన మూలమలుపు కావడంతో పొంచి ఉన్న ప్రమాదం

ఖమ్మం రూరల్, డిసెంబర్ 10 : ఖమ్మం రూరల్ మండలంలోని ఏదులాపురం క్రాస్‌రోడ్డులో ఇటీవల ప్రారంభమైన బిలీఫ్ ప్రైవేట్ ఆసుపత్రి నిబంధనలు ఉల్లంఘించి నిర్మించినట్లు వార్తలు జోరుగా వినిపిస్తున్నాయి. ఒకవైపు వరంగల్ టు రాజమండ్రి రహదారి, మరోవైపు హైదరాబాద్ టు రాజమండ్రి, వరంగల్‌కు వెళ్లే రహదారి ప్రధాన మూలమలుపులో ఆసుపత్రిని నిర్మించడంతో పలు విమర్శలకు తావిస్తున్నది. జాతీయ రహదారి విస్తరణ పనులు జరుగుతున్న సమయంలోనే ఆసుపత్రి నిర్మాణ పనులు సైతం జరిగాయి. ప్రస్తుతం వైద్యశాల పనులు పూర్తయి ఇటీవలే ప్రారంభం కూడా చేశారు. అయితే ఈ ఆసుపత్రిని చూసిన ప్రతిఒక్కరి మదిలో ఇలాంటి మూలమలుపు ప్రదేశంలో ఇంతపెద్ద భారీ కట్టడం ఎలా నిర్మించారు.. అసలు దీనికి అధికారులు అనుమతి ఎలా ఇచ్చారు అనే ప్రశ్నలు పుడుతున్నాయి. ఆసుపత్రి నిర్మాణ ప్రారంభంలోనే పలు ఫిర్యాదులు, మీడియాలో కథనాలు రావడంతో కొద్దిరోజులపాటు నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఆ తరువాత ఏమి జరిగిందో తెలియదు గాని మిగిలిన పనులు సైతం పూర్తిచేసుకొని గత నెలలో ఆసుపత్రి అధికారికంగా ప్రారంభమైంది.



ఏదులాపురం క్రాస్‌రోడ్డులో నిర్మించిన బిలీఫ్ వైద్యశాల

### వారంరోజులకే నోటీసులు..

బిలీఫ్ ప్రైవేట్ ఆసుపత్రి ప్రారంభమై వారంరోజులు గడువకముందే సదరు వైద్యశాల నిర్వాహకులకు జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులు నోటీసులు జారీ చేశారు. సుడా, పంచాయతీ నుంచి సైతం ఒక విధమైన అనుమతులు పొంది నిర్మాణం మరోవిధంగా చేపట్టారని ఆరోపణలు వినపడుతున్న నేపథ్యంలో వైద్యరోగ్య శాఖ నోటీసులు జారీ చేయడం చర్చనీయాంశమైంది. అయితే సదరు వైద్యశాల నిర్వాహకులు వైద్యారోగ్య శాఖ అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ పూర్తిస్థాయిలో అనుమతులు రాకముందే వైద్యసేవలు ప్రారంభించారని గత నెల 27వ తేదీన డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతిబాయి, మండల, పంచాయతీ అధికారులు, ఖమ్మం రూరల్ పోలీసులతో కలిసి స్వయంగా వైద్యశాలను సందర్శించారు. నిర్వాహకులకు నోటీసులు ఇచ్చి పూర్తిస్థాయిలో అనుమతులు వచ్చేవరకు వైద్యసేవలు చేయవద్దని ఆదేశాలు జారీ చేశారు.

### అనుమతి ఒకలా.. నిర్మాణం మరోలా...!

పంచాయతీ కార్యాలయంలో ఒక విధంగా అనుమతి పొంది మరో విధంగా నిర్మాణం చేపట్టారని ఇప్పటికే ఏదులాపురం పంచాయతీ సెక్రటరీ వైద్యశాల నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. ఇందుకు సంబంధించిన పూర్తి నివేదికను పై అధికారులకు అందజేశారు. వైద్యశాలకు పడమర వైపు 100 ఫీట్ల హైవే రోడ్డుకు 6 మీటర్ల సెట్ బ్యాక్‌కు అనుమతి పొంది రెండు మీటర్లు వదిలిపెట్టారని, ఉత్తరం 100 ఫీట్ల హైవే రోడ్డుకు 3.5 మీటర్లు అనుమతి పొంది ఒక మీటరు మాత్రమే వదిలిపెట్టారని, దక్షిణం వైపు 3.5 మీటర్లు సెట్ బ్యాక్ పొంది అసలు స్థలమే వదిలిపెట్టలేదని, తూర్పు వైపున సైతం 3.5 మీటర్ల సెట్ బ్యాక్ అనుమతి పొంది ఖాళీ స్థలం వదిలిపెట్టలేదని నివేదికలో పొందుపరిచారు. జాతీయ రహదారికి ఆనుకొని సెల్లార్, మరో నాలుగు ఫ్లోర్లు సెట్‌బ్యాక్ లేకుండా నిర్మించారని నివేదికలో పొందుపరిచారు. అక్రమ నిర్మాణాలను తక్షణమే తొలగించాలని, లేకుంటే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని నోటీసుల్లో పేర్కొన్నారు.

### నిబంధనలు అతిక్రమించడం వల్లే నోటీసులు



ఏదులాపురం క్రాస్ రోడ్డు వద్ద బహుళ అంతస్తుల భవనాన్ని యజమానులు నిబంధనలు పూర్తిగా అతిక్రమించి నిర్మించారు. అనుమతి ఒక విధంగా తీసుకొని.. నిర్మాణం మరోలా చేపట్టారు. దీంతో నిర్మాణం జరుగుతున్న క్రమంలోనే సదరు యజమానికి నోటీసులు జారీ చేశాం. అయితే నిబంధనలకు అనుగుణంగా నిర్మాణం చేపడుతామని తిరిగి వారి నుంచి సమాధానం రావడంతో మళ్లీ పనుల పునరుద్ధరణ జరిగింది. నిర్మాణం పూర్తయిన తర్వాత సైతం పూర్తిస్థాయిలో నిబంధనలు పాటించలేదు. దీంతో సదరు బిల్డింగ్ యజమానిపై జిల్లా అధికారులకు ఫిర్యాదులు రావడంతో మరోసారి పూర్తిస్థాయి నివేదికను తయారు చేసి ఉన్నతాధికారులకు అందజేశాం.

**–పీ రాజారావు, మండల పంచాయతీ అధికారి, ఖమ్మం రూరల్**

## ముగిసిన వైజ్ఞానిక ప్రదర్శన

### ఇన్‌స్పైర్‌ను సందర్శించిన జడ్పీ సీఈవో, టీచర్ ఎమ్మెల్సీ



ప్రదర్శనలను తిలకిస్తున్న విద్యార్థినులు

ఖమ్మం ఎడ్యుకేషన్, డిసెంబర్ 10: జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఖమ్మంలోని ఎస్ఎఫ్ఎస్ పాఠశాలలోని విక్రమ్ సారాబాయి ప్రాంగణంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి వైజ్ఞానిక, ఇన్‌స్పైర్ ప్రదర్శన రెండోరోజు మంగళవారంతో ముగిసింది. విద్యార్థులు తయారుచేసి ప్రదర్శించిన అనేక ఎగ్జిబిట్లు అందరినీ ఆకట్టుకున్నాయి. జడ్పీ సీఈవో దీక్షా రైనా, టీచర్ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి కూడా హాజరై ఈ ప్రదర్శనను తిలకించారు. సీఎస్ఐఆర్ శాస్త్రవేత్త చినరాజు, నాసా మెంటార్ ట్రైనర్ గద్దె పుల్లారావు, బోటనీ గోపాలరావు తదితరులు హాజరై సైన్స్ ప్రయోగాల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శాస్త్రీయ దృక్పథాన్ని, ప్రశ్నించేతత్వాన్ని విద్యార్థులు పెంపొందించుకోవాలని సూచించారు. భోజన సౌకర్యం ఏర్పాటుచేసిన ట్రస్మా బాధ్యులు గుర్రం కాంతారావు, జాఫర్ మతిన్, పోలవరపు శ్రీకాంత్, కూడారపు సూరిబాబు, కొండపల్లి శశిధర్ రెడ్డి, పైడిమర్ల అశోక్‌రెడ్డి, టీవీ అప్పారావు, శెట్టి భాస్కర్, మన్నె కిశోర్, చంద్రశేఖర్‌లను డీఈవో సోమశేఖరశర్మ, ఎంఈవో శైలజాలక్ష్మి అభినందించి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన 14 సైన్స్‌ఫెయిర్, 12 ఇన్‌స్పైర్ ప్రదర్శనలకు పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ మండలాల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.